ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- నేటి నుంచి సుబ్బారాయుడి కల్యాణోత్సవాలు
- 29వ తేదీ వరకు నిర్వహణ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మార్గశిర మాసంలో ఈ ఉత్సవాలు 13 రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 17 నుంచి 29 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ఆలయ చరిత్ర...

స్వామివారి ఆలయాన్ని 1854లో గ్రామస్తులు నిర్మించారు. ఇందుకు సంబంధించి ఒక సంఘటన స్థానికంగా ప్రచారంలో ఉంది. సింగరాయపాలెం బావాజీ మఠంలో ఉన్న ఒక పుట్టలో నుంచి దేవతా సర్పం స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ చెరువులోనికి వచ్చి స్నానం చేసి తిరిగి వెళుతుండగా చేవూరుపాలెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపరచడంతో పాము మరణించింది. దీనివల్ల గాయపర్చిన ఇరువురికి కంటిచూపు పోగా ఆలయాన్ని నిర్మిస్తామని వేడుకోవడంతో చూపు వచ్చినట్లు చెబుతారు. దీనితో గ్రామస్తులు ఐక్యంగా సుబ్రహ్మణ్యేశ్వరునికి ఆలయాన్ని నిర్మించారు. దినదినాభివద్ధి చెందుతున్న ఈ ఆలయాన్ని 1987లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది.

విశేష కార్యక్రమాలు..

ఈ ఏడాది ఉత్సవాలకు సంబంధించి పలు విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. ఆదివారం పంచమి తిథిలో స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరిస్తారు. షష్ఠి తిథి రోజున అనగా 18న రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరుపుతారు. ఉత్సవాల్లో భాగంగా 20న స్వామివారి కల్యాణ రథోత్సవం, 21న తెప్పోత్సవం జరుగుతాయి. 22న ఏకాదశ మహారుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర దీపారాధనలు నిర్వహిస్తారు. 24న త్రయోదశి సందర్భంగా సుబ్రహ్మణ్య హవనం, 26న పుష్పశయ్యాలంకత పర్యంక సేవ, 29న అఖండ అన్నసమారాధన వంటి కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పేరెన్నికగన్న పౌరాణిక నాటక నటులతో సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి వంటి నాటకాలు ప్రదర్శించనున్నారు.



ముస్తాబైన ఆలయ రాజగోపురం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

విజయవంతం చేస్తాం..

స్వామివారి కల్యాణోత్సవాలు పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.



సింగరాయపాలెం షష్ఠి మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఉత్సవ కమిటీ నియామకం..

శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలకు 8 మంది సభ్యులతో ఉత్సవ కమిటీని దేవదాయశాఖ ఏర్పాటు చేసింది. ఉత్సవాలను పర్యవేక్షించేందుకు కమిటీ సభ్యులుగా ఋసన బోయిన ఆంజనేయులు, గణేషుల నాగసురేష్, భట్రాజు రుక్మిణీ, కటకన సత్యప్రసాద్, వడ్లమన్నాడు సావిత్రి, రెడ్డి త్రివేణి, చెన్నూరి వరలక్ష్మీ, లేళ్ళ వెంకటేశ్వరమ్మను నియమిస్తూ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

గుడివాడ టౌన్: ప్రభుత్వ సూచనల మేరకు ఈనెల 18వ తేదీన కులగణన నిర్వాహణపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో నిర్వహించే ఈ సమావేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, సంక్షేమ అభివృద్ధి సంచాలకులు, కుల సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ అధికారులు, హాస్టల్ వార్డెన్లు, రెసిడెన్సియల్ ప్రిన్సిపాల్స్, వార్డు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు పాల్గొంటారన్నారు. ఈ కులగణన కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల నాయకులు, ప్రజాప్రతినిధులు సూచనలు, సలహాలు అందించవలసిందిగా కోరారు.

డ్రెయినేజీ పనులకు భూమిపూజ



గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని డ్రెయిన్‌లను ప్రక్షాళన చేసి మురుగునీటి పారుదలకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ ఇంజినీర్ బి.విజయదుర్గ అన్నారు. శనివారం స్థానిక 9వ వార్డులో రూ.20 లక్షలతో పునఃనిర్మిస్తున్న డ్రెయిన్లకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారాలకు ఈ మొత్తాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఈ ప్రాంతానికి చెందిన మురుగునీరు నేరుగా చింతలకోడు డ్రెయిన్‌లో కలుస్తుందన్నారు. తద్వారా మురుగునీటి సమస్య తొలగిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాసులు, ఆర్ఓ విజయకుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాశరావు, వార్డు ఇన్‌చార్జ్ జోగా కిషోర్, కన్వీనర్ గొర్రెల శ్రీను, గాదె మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వీధిలైట్ల ప్రారంభం



మండవల్లి: మండలంలోని జగనన్న కాలనీలో వీధిలైట్లను సర్పంచ్ పెరుమాళ్ల పద్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని అన్ని గ్రామాల్లో వీధిలైట్ల వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిపాలనపై పట్టు సాధించాలి



ముదినేపల్లి రూరల్: పంచాయతీల పరిపాలనపై పట్టు సాధిస్తేనే గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో పీ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల పరిపాలన విధానం, పన్నుల వసూళ్లు, లేఅవుట్ల అనుమతి గురించి రికార్డులు తయారుచేసే విధానం గురించి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి రమణరావు, ఈవోపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



గుడివాడ టౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లు, ఈవీ ప్యాడ్‌ల వినియోగంపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పెద్దవీధి సంఘంబడి వద్ద స్థానికులకు ఈవీఎంల వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వార్డుకు సంబంధించిన పలువురితో పాటు అటుగా ప్రయాణించే ప్రతి ఒక్కరినీ ప్రత్యక్షంగా ఈ వినియోగంలో భాగస్వాములను చేస్తూ వారి అభిప్రాయాలు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ ఈవీఎంల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ఈ విధానం ద్వారా తాము ఎవరికి ఓటు వేసింది, ఇట్టే తెలిసిపోతుందని ఈవీఎంల డెమాన్‌స్ట్రేటర్ పి.శ్యాంబాబు తెలిపారు. దీని ద్వారా ఏ విధమైన మోసం జరగడంలేదని తెలుసుకోగలుగుతున్నామని ప్రజలు అభిప్రాయపడుతున్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు రంజిత్, మోషే, తదితరులు పాల్గొన్నారు.

మేథమేటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: తమ విద్యార్థులు ఐదుగురు ఇంటర్ నేషనల్ మేథమెటిక్స్ ఒలంపియాడ్ (ఐఎస్ఎంఓ) 3వ లెవల్‌కు అర్హత సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్ ఫ్యాక్ట్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి శనివారం తెలిపారు. హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ వారు ప్రతిష్టాత్మకంగా అక్టోబర్ 29న విజయవాడలో నిర్వహించిన రీజినల్ మేథమెటికల్ ఒలింపియాడ్ రెండవ లెవల్ పోటీల్లో విజయం సాధించారు. అర్హత పొందిన జీవీ చంద్రశేఖరరెడ్డి, జె.లీలా సాత్విక్, సీహెచ్ వెంకటసాయి అనీష్, పి.నవదీప్, సీహెచ్ ఉజ్వల్‌రామ్ జనవరి 21వ తేదీన జరగబోయే (ఐఎస్ఎంఓ) పరీక్షలకు హాజరవుతారని అన్నారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, పి.లక్ష్మి ప్రసాద్, కె.జ్యోతి, జబ్రీనా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



పమిడిముక్కల: పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని తలశిల సుప్రియ హాకీ పోటీలో ప్రతిభ చూపారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఇటీవల జరిగిన 14 సంవత్సరాలలోపు బాల, బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కేశవనారాయణ తెలిపారు. ఈ నెల 25 నుంచి రాజస్థాన్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. హైస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థిని సుప్రియను, శిక్షణ ఇచ్చిన పీడీ నారాయణను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు: స్థానిక ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రాంతీయ బాలికల ఆటల పోటీల్లో ప్రతిభను చాటి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. ఈ విషయాన్ని శనివారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకూ నందిగామ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంతీయ బాలికల ఆటల పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్ డబుల్స్ అండ్ సింగిల్స్‌లో విన్నర్స్‌గా, చెస్‌లలో రన్నర్స్‌గా, రన్నింగ్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 100, 400 రిలే విభాగంలో ప్రథమం, 800 మీటర్లలో ద్వితీయం, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్‌లో ప్రథమం, బ్రాడ్ జంప్‌లో ద్వితీయ స్థానాలను సాధించారు. విజేతలను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహకార్యదర్శి రామకృష్ణ, మెంటార్, ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

రూ.కోటితో మండలాభివృద్ధి

బాధ్యతలు చేపట్టి రెండున్నరేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీపీ సురేష్



పెదపారుపూడి: మండలంలో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన సుమారు రెండున్నరేళ్ల కాలంలో మండల పరిషత్ నిధుల నుంచి కోటి రుపాయిలతో మండలంలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 15 ఆర్థిక సంఘ నిధులు నుంచి సుమారు రూ.78 లక్షలతో అంతర్గ సీసీ రోడ్లు నిర్మించామన్నారు. అప్పికట్ల గ్రామంలో 9 రోడ్లు, వింజరంపాడులో 8 రోడ్లు, మోపర్రు, పాములపాడు, తదితర గ్రామాల్లో అంతర్గ రోడ్లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. మంచి నీటి అవసరాల కోసం వానపాముల సచివాలయం వద్ద బోర్, జువ్వనపూడి, అప్పికట్ల, సోమార్పాడు తదితర గ్రామాల్లో సుమారు రూ.15 లక్షతో తాగునీటికోసం బోర్లు వేశామని వివరించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయటంతో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. దీంతో ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు మరోసారి 30 వేల మెజార్టీతో ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌ను గెలిపించటం ఖాయమని జోస్యం చెప్పారు.

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతకు సత్కారం

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉభయ కృష్ణా, గుంటూరు జోన్ ఇన్‌చార్జ్‌గా ఇటీవల నియమితులైన కేజే విక్టర్‌పాల్‌ను పార్టీ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు విక్టర్‌పాల్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విక్టర్ పాల్ మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి ఇచ్చిన ఈ బాధ్యతకు పూర్తిగా న్యాయం చేస్తానని క్రిస్టియన్ మైనార్టీలకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను మరింత చేరువచేస్తానన్నారు. తనకు ఈ పదవి వచ్చేలా కృషిచేసిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)కి తాను రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, వెంపటి సైమన్, విజ్జి కృపారావు, శ్యాంబాబు, మామిళ్ల ఎలీషా, సురేఖ, మట్టా కమల తదితరులు పాల్గొన్నారు.



విక్టర్ పాల్‌ను సత్కరిస్తున్న నాయకులు

మళ్లీ జగనన్న పాలనే కావాలి

గుడివాడ టౌన్: స్థానిక 19వ వార్డులో జగనన్న ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు కావాలంటే కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో వార్డుకు సంబంధించి 2,298 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.7 కోట్ల 29 లక్షల 5 వేల 784, 1,028 మంది లబ్ధిదారులకు పరోక్షంగా రూ.4 కోట్ల 42 లక్షల 14 వేల 566, మొత్తం రూ.11 కోట్ల 71 లక్షల 20 వేల 350 వంతున ప్రజలకు అందజేశారన్నారు. అందుకే జగనన్న పాలన మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్ఓ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాశరావు, వార్డు ఇన్‌చార్జ్ జోగా కిషోర్, కన్వీనర్ గొర్రెల శ్రీను, గాదె మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



19వ వార్డులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, పార్టీ నాయకులు

సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి

ముదినేపల్లి రూరల్: ఆర్అండ్‌బీ స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వైవీ కిషోర్‌బాబు తహసీల్దార్‌ను కోరారు. మండలంలోని పెదకామనపూడిలో ఆర్అండ్‌బీ రహదారిని ఆక్రమించి అక్రమంగా షెడ్డు నిర్మాణం చేశారని దీనిని తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన షేక్ కుల్తున్నీస్సా స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వడాలి–తాడినాడ ఆర్అండ్‌బీ రోడ్డుకు సంబంధించి పెదకామనపూడిలో అక్రమ కట్టడంగా పేర్కొంటున్న ప్రాంతంలో సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలని కోరుతూ తహసీల్దార్‌ను కోరడంతో పాటు ఫిర్యాదు చేసిన కుల్తున్నీసాకు శనివారం సమాచారం పంపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్ హోలీ క్రాస్ హైస్కూల్ వద్ద గల లైట్ ఆఫ్ క్రైస్ట్ వారియర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చోరగుడి మోహన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత క్రిస్మస్ కేక్ కట్‌చేసి దైవ సందేశాన్ని అందజేశారు. అనంతరం చిన్నారులు క్రిస్మస్ నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు.

అక్షింతల పంపిణీ

ముదినేపల్లి రూరల్: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో నూతనంగా నిర్మిస్తున్న రామమందిరంలో వచ్చే నెల 22న జరగనున్న బాలరాముని నూతన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అయోధ్యలో కలపబడిన అక్షింతలను ముదినేపల్లిలో శనివారం పంపిణీ చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ముదినేపల్లి పెదరామాలయంలో అక్షింతల పంపిణీ కార్యక్రమం జరిగింది. తొలుత అక్షింతలను స్వామివారి పూజలో ఉంచి ఊరేగించి స్థానిక కైకలూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పెద్దరామాలయంలో అక్షింతలను పంపిణీ చేశారు. వీహెచ్‌పీ మండల ప్రతినిధి వెలివెల గోపినాథ్, ఆర్యవైశ్య నాయకుడు ఒత్తిమిల్ల ప్రసాద్, రామాలయ ప్రధాన అర్చకుడు బృందావన శ్రీనివాసాచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

గుడ్లవల్లేరు: అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంకేతిక విద్య, విజ్ఞానం ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను శనివారం అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కోదండ రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

మొవ్వ: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రభుత్వం చేయూత ఇచ్చి ఆదుకుంటుందని ఎంపీపీ కొండేటి ఇందిర సూచించారు. మొవ్వ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలోని భవిత తరగతి గదిలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగుల్లో తెలివి తేటలను వెలికి తీసి ఉన్నతులుగా తీర్చి దిద్దేందుకు భవిత తరగతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు సూచించారు. సీడీపీవో పి.భానుమతి, ఐఈఆర్‌టీ వాణిశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. క్రీడల్లో, విద్యలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి తీరని లోటు

పామర్రు: ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ కామ్రేడ్ షేక్ సాబ్జీ ఆకాల మృతి తీరని లోటు అని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.అంకరవి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సాబ్జీ చిత్ర పటానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ సంఘాన్ని అగ్ర పథంలో నడిపి, ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ లోకంలో ఆశాదీపంగా వెలిగిన సాబ్జీ మృతి ఉపాధ్యాయ సంఘానికి తీరని నష్టం అని అన్నారు. యూటీఎఫ్ నాయకులు సీతారామయ్య, రవీంద్ర ప్రసాద్, పీ రవి, శాంతి అంకరవి, ప్రకాశరావు, బ్రహ్మయ్య, విజయవాణి, శ్రీ జ్యోతి, సంధ్యా రాణి, శ్రీనివాస్, రాఘవేంద్ర, ముస్తాఫా, రమేష్, సీఐటీయూ నాయకులు గంగాధర్, ఎస్ఎస్ఏ ఓటా సోరింగ్ ఉద్యోగస్తులు నాగార్జున, ప్రశాంతి, రోజా , శ్యామలా లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం

కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో కైకలూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత లభించింది. మండవల్లికి చెందిన బీసీ నాయకులు చేబోయిన వీర్రాజును రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీగా నియమించారు. కైకలూరుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ హమీద్‌కు రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ పదవి లభించింది. తమకు రాష్ట్ర స్థాయిలో పదవులు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వీర్రాజు, హమీద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి మండవల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి 19 వరకు జరుగుతాయని దేవస్థాన అభివృద్ధి కమిటీ, ధర్మకర్తల మండలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 8 గంటలకు ఉత్సవ ప్రారంభం, 9 గంటలకు ఊరేగింపు జరుగుతాయని పేర్కొన్నారు. 18న ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి పాలు పోయుట, పూజలు, మొక్కుబడులు చెల్లించుట, 19వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక

గుడివాడ టౌన్: స్థానిక నలంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని వి.వాగ్దేవి ఢిల్లీలో జరగనున్న జాతీయ కళా ఉత్సవ్ పోటీలకు అర్హత సాధించింది. శనివారం పాఠశాలలో జాతీయ పోటీలకు అర్హత సాధించిన వాగ్దేవిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని పీఎల్ స్రవంతి మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగిన కళా ఉత్సవ్–2023లో పాఠశాల ఉపాధ్యాయులు పీవీ సత్యన్నారాయణ రచించి దర్శకత్వం వహించిన మందరగా ఏకపాత్రాభినయ ప్రదర్శనకు వాగ్దేవి మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అవసరాలకు రూ.80 వేలతో జెట్ మోటారు ఏర్పాటు చేసిన మాజీ కరస్పాండెంట్ నర్రా పద్మజను సత్కరించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి చెప్పారు. కైకలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)తో కలసి ఆయన నివాసం వద్ద ముదినేపల్లి మండలం కొర్రగుంటపాలెం విఘ్నేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం, టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చిన రూ.2.03 లక్షల చెక్కును కమిటీ సభ్యులకు శనివారం అందించారు. పలువురు పాల్గొన్నారు.

రైతుల జాబితాల ప్రదర్శన

మండవల్లి: మిచాన్ తుపాను కారణంగా వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలను మండలంలోని అయ్యవారిరుద్రవరం, మండవల్లి, లోకుమూడి, గన్నవరం, పెరికెగూడెం, లేళ్లపూడి, పసలపూడి, కానుకొల్లు, లింగాల తదితర రైతు భరోసా కేంద్రాల వద్ద, సచివాలయాల్లో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే సరిచేసుకోవడానికి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ నెల 18న మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

కైకలూరు: మిచాంగ్ తుపాను పంట నష్ట రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నామని వ్యవసాయశాఖ ఏడీ ఆర్. గంగాధరరావులీ సందర్భంగా చెప్పారు. గోపవరం రైతు భరోసా కేంద్రంలో జాబితాల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉలిసి శ్యాంబాబు, వ్యవసాయ సహాయకుడు ధర్మతేజా, రైతులు హాజరయ్యారు.

5 వేల ఎకరాల్లో పంట నష్టం

ముదినేపల్లి రూరల్: తుపాను వల్ల మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారిణి. వేణుమాధవ్ శనివారం తెలిపారు. గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు పంట నష్టం అంచనా సర్వే జరుగుతోంది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. నష్టం అంచనాలు సిద్ధం చేసి సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్బీకేల వద్ద జాబితాలు ప్రదర్శిస్తామన్నారు. గ్రామస్థాయిలో గ్రామవ్యవసాయ సహాయకుడు, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీతో కూడిన కమిటీలు పర్యటించి పంటనష్టం అంచనాలు తయారుచేసినట్లు చెప్పారు.